

చదువే ధ్యేయంగా ముందుకు సాగాలి

- ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువే ప్రధాన లక్ష్యంగా ఉండి ధైర్యంగా ముందుకు సాగినట్లయితే బలమైన భవిష్యత్తు నిర్మించుకోవచ్చని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా దిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఎల్ఎఫ్ ఇంగ్లిష్ లెర్న్ టు రీడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ తన చాంబర్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్‌లో ఇంటర్వ్యూ, అభిరుచులు, రోల్ మోడల్‌పై ఆత్మవిశ్వాసంతో ముఖాముఖి నిర్వహించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతపై చిన్న రోల్‌ప్లే కూడా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దిశ ఫౌండేషన్ భాగస్వామ్యంతో జిల్లాలోని 72 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్ చదవడం, నేర్చుకునే ప్రోగ్రాం అమలవుతుందని అన్నారు. తద్వారా విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ములుగు, బంజరుపల్లి ఎంపీపీఎస్ ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, దిశ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎమ్డీ.ముబీన్, సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టవద్దు

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ
- సీసీఐ కొనుగోలు కేంద్రాల తనిఖీ



చిట్యాలలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

చిట్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తిని విక్రయించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మండలంలోని రెండు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పత్తిలో తేమ శాతం, ఎలక్ట్రిక్ కాంటా, కపాస్ కిసాన్ యాప్‌లో రైతుల వివరాలు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. సీసీఐ, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, మిల్లుల యజమానులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేవిధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా, సీసీఐ ఇన్‌చార్జి పట్టాభిరామయ్య, మిల్లుల యాజమాన్యం లాకుల బాలచందర్, భాస్కర్, సాయి, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో జోష్



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపుతో సంబరాల్లో శ్రేణులు
- గత నెల రోజులుగా జూబ్లీహిల్స్‌లో మకాం వేసిన ఓరుగల్లు నేతలు
- డివిజన్లలో ఉమ్మడి జిల్లా క్యాడర్‌తో విస్తృతంగా ప్రచారం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఊపు తెచ్చిన ఉప ఎన్నిక
- ఇదే జోరుతో లోకల్‌పై జెండా ఎగురవేస్తామనే ధీమాలో హస్తం నేతలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు కాంగ్రెస్ శ్రేణులకు ఉత్సాహాన్నిచ్చింది. గత నెల రోజులుగా పైగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్పొరేషన్ చైర్మన్‌లు హైదరాబాద్‌లో మకాం వేసి ప్రచారం నిర్వహించారు. భారీ మెజారిటీతో కాంగ్రెస్ గెలవటంతో ఓరుగల్లు కాంగ్రెస్‌లో ఉత్సాహం ఉరకలేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న క్యాడర్‌కు జూబ్లీహిల్స్ ఫలితం జోష్ నింపుతోంది. ఇదే ఊపుతో స్థానికంలో క్లీన్‌స్వీప్ చేస్తామనే ధీమా క్యాడర్‌లో కనిపిస్తోంది.

జూబ్లీహిల్స్ ప్రచారంలో ఓరుగల్లు శ్రేణులు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపే లక్ష్యంగా నెల రోజులకు పైగా ఉమ్మడి వరంగల్‌కు చెందిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కేఆర్.నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రామచంద్రనాయక్, మురళీనాయక్‌లు.. తమకు కేటాయించిన డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వీరు తమ సొంత నియోజకవర్గాల నుంచి ద్వితీయ శ్రేణి నేతలను జూబ్లీహిల్స్ ప్రచారానికి తీసుకెళ్లి అక్కడే మకాం వేశారు. వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన సమయంలో మాత్రమే ప్రజల్లో కనిపించటమే కాకుండా.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పట్టుబట్టి సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకవచ్చారు. ఆ తరువాత మళ్లీ జూబ్లీహిల్స్ ప్రచారంలోనే పాల్గొన్నారు. ఓరుగల్లుకు చెందిన కార్పొరేషన్ చైర్మన్లు కూడా హైదరాబాద్‌లోనే మకాం వేసి ప్రచారంలో తమ వంతు పాత్ర పోషించారు. తమకు బాధ్యతలు అప్పగించిన అన్ని డివిజన్లలో కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యత రావటం శ్రేణుల్లో ఉత్సాహన్ని నింపింది. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని 25వేల ఓట్లు ఆధిక్యంతో కైవసం చేసుకోవటం కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నింపింది. తమ ప్రచారానికి ఫలితం దక్కిందని, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను ప్రజలు స్వాగతించారని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.



భూపాలపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

రాబోయే ఎన్నికలకు జూబ్లీ ఊపు..

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలుపు ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పడుతుందని కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమినే ఎదుర్కొంటున్నది. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ స్థానాలు వరంగల్, మహబూబాబాద్‌లో ఓటమిని చవిచూసింది. అలాగే వెంటనే జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో సైతం గులాబీ పార్టీకి పరాజయమే ఎదురైంది. ఇటీవల జరిగిన కరీంనగర్ టీచర్, పట్టభద్రుల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ ఓటమి చూసింది. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా అపజయమే ఎదురుకావటంతో కారు పార్టీ క్యాడర్‌లో నిరుత్సాహం అలుముకుందనే చర్చ జరుగుతోంది. ఉప ఎన్నికలో గెలిచిన ఊపుతో స్థానిక సంస్థల

(మిగతా 7వ పేజీలో)

డాక్యుమెంట్ రైటర్ల వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు

- గుర్తించిన ఏసీబీ అధికారులు
- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



భూపాలపల్లిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

భూపాలపల్లిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్లు, మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటున్నట్లు గుర్తించామని వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాంబయ్య మాట్లాడుతూ ఏసీబీ డీజీ ఆదేశాల మేరకు తాము తనిఖీలు చేపట్టడం జరిగిందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తనిఖీలు ప్రారంభించి కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏజెంట్లు, మధ్యవర్తులు, డాక్యుమెంట్ రైటర్లు నేరుగా సబ్‌రిజిస్ట్రార్ వద్దకు వచ్చి పనులు చేయిస్తున్నారని చెప్పారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. సంబంధిత భూమి యజమానే అధికారి వద్దకు వచ్చి డాక్యుమెంట్లు సమర్పించి రిజిస్ట్రేషన్ చేసుకుని తానే స్వయంగా పత్రాలు తీసుకువెళ్లాలని అన్నారు. కానీ, భూపాలపల్లిలో మాత్రం ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు తీసుకువెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలాంటి అవకతవకలను గుర్తించామని తెలిపారు. ఈ విషయంపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో విచారణ అనంతరం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎల్.రాజు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

కాటారం డివిజన్‌కు 500 కుట్టుమిషన్లు రాక

- సీఎస్ఆర్ కింద కుట్టు శిక్షణ కోసం వైట్రీస్ కంపెనీ పంపిణీ



రైతువేదికలో సిద్ధంగా ఉన్న కుట్టు మిషన్లు

కాటారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాటారం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో కుట్టు శిక్షణ కేంద్రాల ను నెలకొల్పి వందలాది మంది మహిళలను కుట్టులో నైపుణ్యవంతులుగా చేసి ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ ప్రాంత మహిళలకు చేయూత అందించడానికి వైట్రీస్ కంపెనీ ద్వారా సీఎస్ఆర్(కార్పొరేట్ (మిగతా 8వ పేజీలో)

గ్రంథాలయాలు సమాజానికి జ్ఞాన దీపాలు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యా వికాసానికి, సమాజానికి జ్ఞాన దీపాలుగా గ్రంథాలయాలు ఉపకరిస్తాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం భూపాలపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర హాజరై మాట్లాడారు. విద్యా ప్రగతికి గ్రంథాలయాలు దోహదం చేస్తాయని అన్నారు. అలాగే అనేక రకాల పుస్తకాలు జీవిత పాఠాలు నేర్పిస్తాయని తెలిపారు. ఇవి విజ్ఞాన భాండాగారాలన్నారు. కానీ, నేడు సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత ప్రతీ విషయాన్ని గూగుల్‌లో సెర్చ్ చేస్తున్నారని అన్నారు. గతంలో ప్రతి విషయాన్ని పుస్తకాలలో చదివి తెలుసుకునే వారని చెప్పారు. సెల్‌ఫోన్ వినియోగం మూలంగా చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అదే పుస్తకమైతే ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. సెల్‌ఫోన్ అవసరం ఎంతుందో అంతే వాడాలని సూచించారు. జిల్లా గ్రంథాలయానికి అదనపు భవనం కోసం రూ.కోటి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో అన్ని సౌకర్యాలతో పాటు అన్ని రకాల పుస్తకాల కొనుగోలు కోసం మరో రూ.10 లక్షలు వెచ్చిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, కార్యదర్శి శ్రీలత, నాయకులు దాట్ల శ్రీనివాస్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి

- ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాఘవరెడ్డి



మేడారంలో రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం, నార్లాపూర్, కొత్తూరు గ్రామాల్లో జరుగుతున్న మేడారం ప్రధాన రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ రాఘవరెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి శుక్రవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ శ్యాంసింగ్‌తో మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి డిసెంబరు 12 వరకు 90 శాతం పనులు పూర్తి చేయాలన్నారు. మేడారంలో ఊరట్టం క్రాస్ నుంచి ఆర్టీసీ వై జంక్షన్ వరకు 3.2 కిలోమీటర్లు, నార్లాపూర్‌లో చింతల్ క్రాస్ నుంచి కొత్తూరు వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు రూ. 27.5 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రీ మేడారంలో వచ్చే భక్తుల వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిరంతరం పనుల వద్ద ఉంటూ నాణ్యతా లోపాలు జరుగకుండా చూడాలని అన్నారు. కాంట్రాక్టర్లు రాత్రిపగలు పనులు చేపట్టాలని ఏఈ స్థాయి అధికారులు మేడారంలోనే ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటరమణ, ఏఈలు, ఫీల్డ్ అధికారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఐలయ్య (ఫైల్)

మల్హర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మల్హర్ మండలం రుద్రారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కొయ్యూర్ పోలీసులు తెలిపిన ప్రకారం... రుద్రారం గ్రామానికి చెందిన అప్పాల ఐలయ్య(40) అనే రైతు తనకున్న ఎకరంతో పాటు మరో రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఐలయ్య శుక్రవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు.

కరెంట్ లేనందున పొలం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ హ్యాండిల్ పడిపోయి ఉండడంతో దానిని పట్టుకోగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఐలయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా, భార్య ఐలక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో మావోయిస్టు నేత ఆజాద్?!

సికాస ఆర్గనైజర్ అశోక్ కూడా..

గోవిందరావుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు కీలక నేత కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌ను ములుగు జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం ఆర్గనైజర్ అశోక్ కూడా పట్టుబడ్డట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం వీరిరువురిని పస్రా సమీపంలో పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు వినికిడి. పెద్దఎత్తున ఎన్‌కౌంటర్లు జరుగుతుండగా అగ్ర నేతలు ఒక్కొక్కరు హతమవుతున్నారు. ప్రధాన కేడర్ అంతా అంతరించి పోతోంది. ఈ క్రమంలో కేంద్ర కమిటీ నేతలే వందలాది మంది సభ్యులతో పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. 20 ఏళ్ల క్రితం పోరుబాటను ఎంచుకొని అజ్ఞాతంలోకి వెళ్లిన ఆజాద్ ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. ఆయనతో పాటు సికాస ఆర్గనైజర్ అశోక్ జనజీవన స్రవంతిని ఎంచుకొని సరెండర్ అయ్యేందుకు వస్తుండగా పోలీసులు మాటువేసి పట్టుకున్నట్లు తెలుస్తోంది. ములుగు జిల్లాకు చెందిన మరో కీలక నేత ఆశన్న అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు ఇటీవల ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట లొంగిపోగా.. రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్, మోస్ట్ వాంటెడ్ ఆజాద్ అలియాస్ కొయ్యడ సాంబయ్యను కూడా లొంగిపోవాలని జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఆజాద్ అరెస్టయ్యారనే విషయం సంచలనంగా మారింది. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వెంటనే కోర్టులో హాజరుపర్చాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి ఎన్.నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వారిని చిత్రహింసలకు గురిచేస్తున్నారని, ఎటువంటి ప్రాణహాని తలపెట్టవద్దన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



కాటారంలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీచర్లు

భూపాలపల్లిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. భూపాలపల్లిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రమేష్‌బాబు దివ్యాంగ బాలలతో గడిపారు. వారికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి నాగరాజ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అఖిల, ప్రభుత్వ ప్లీడర్ సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసచారి పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లిలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్‌ను తయారుచేసి ప్రదర్శించారు. వాటిని సింగరేణి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ మారుతి హాజరై తిలకించారు.

● కాటారం(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం (మిగతా 8వ పేజీలో)

కాళేశ్వరాలయంలో కార్తీక పూజలు

మహదేవపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వరానికి శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేసి తులసి చెట్టు వద్ద లక్ష దీపాలు అలంకరించారు. అలాగే శుభానందదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి చీర సారె సమర్పించారు.



ఆలయంలో భక్తుల రద్దీ

ఆలయంలో భక్తుల పూజలు

అర్హతలు లేకుండా వైద్య పరీక్షలు

● కొడకండ్లలో మాతృశ్రీ పీహెచ్‌సీ సీజ్



మాతృశ్రీ పీహెచ్‌సీని సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో

కొడకండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):అర్హతలు, లైసెన్స్ లేకుండా వైద్య సేవలు అందిస్తున్న జనగామ జిల్లా కొడకండ్ల మండలకేంద్రంలోని మాతృశ్రీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.మల్లికార్జున్ రావు పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృశ్రీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాక్టీస్ చేస్తున్న వ్యక్తికి తగిన అర్హతలు, లైసెన్స్ లేదన్నారు. నకిలీ వైద్యులు ప్రాక్టీస్‌తో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. జిల్లాలో అక్రమంగా కొనసాగుతున్న ఇలాంటి వైద్య కేంద్రాలపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ



చోరీ జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

తరిగొప్పుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరు చోరీ చేసిన ఘటన శుక్రవారం జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్‌లో జరిగింది. బాధిత రైతు మ్యాక రాజయ్య కథనం ప్రకారం తన వ్యవసాయ క్షేత్రంలో బోరు మోటార్ అవసరాల నిమిత్తం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారన్నారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రాగివైరును చోరీ చేశారన్నారు. శుక్రవారం ఉదయం దొంగతనం గుర్తించి విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

న్యాయ సేవలను వినియోగించుకోవాలి

● జడ్జి ధీరజ్ కుమార్



మాట్లాడుతున్న జడ్జి ధీరజ్ కుమార్

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సీని యర్ సిటిజన్‌ల కోసం తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ క్లినిక్‌లను విని యోగించుకోవాలని తొర్రూరు కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ లీగల్ సర్వీస్ క్లినిక్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లకు న్యాయ సహాయం అందించడానికి ట్రిబ్యునల్‌లో లీగల్ సర్వీస్ క్లినిక్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ క్లినిక్‌లలో దరఖాస్తుల స్వీకరణతో పాటు ఇతర విధానపరమైన విషయాల్లో సహాయం చేస్తుందని, శిక్షణ పొందిన పారా లీగల్ వలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటి స్థాపనను అన్ని ప్రభుత్వ సంబంధిత సంస్థలు సంబంధిత ఎన్‌జీవోలకు తెలియజేయాలని, ఈ క్లినిక్‌లు రెగ్యులరైజేషన్ ద్వారా నిర్వహించబడతాయని, తల్లిదండ్రులు, సీనియర్‌లకు సాయం చేయడానికి ఉపయోగపడతాయన్నారు. ప్రతి సోమవారం ఒక పారాలీగల్ వలంటీర్ ఉదయం 10గంటల నుంచి సాయం త్రం వరకు అందుబాటులో ఉంటారని సలహాలు, సూచనలకు సంప్రదించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, ఎమ్మార్వో శ్రీనివాస్, కె. నిఖిల్ కుమార్, ఏజీపీ ఎల్.శ్రీనివాస్, కోర్టు సిబ్బంది, మహేష్, కుమార్, యాకాంబ్రం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

● అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్



వెల్లికట్టెలో తూకం వేసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్

తొర్రూరు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం తొర్రూరు మండలంలోని వెల్లికట్టె, అమ్మాపురం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నమోదు ఏ విధంగా చేస్తున్నారని నిర్వాహకులను అడిగి పలు సూచనలు చేశారు. కేంద్రం వద్ద ఏమైన సమస్యలు ఉన్నాయా అంటూ రైతులను అడుగగా క్లీనింగ్ మిషన్లు, టార్పాలిన్లు అందుబాటులోకి తీసుకురావాలని, కౌలు రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

అనంతరం ధాన్యం బస్తా కాంటా 41.300 వేస్తుండగా, తూకం వేసిన బస్తాలను పరిశీలించి ప్రతి బస్తా 41కేజీల వరకు మాత్రమే తూకం వేయాలని ఆదేశించారు. గత వేసవిలో ప్రభుత్వం బోనస్ వేయకపోవడంతో ధాన్యాన్ని దళారులకు విక్రయించుకుంటున్నామని రైతులు వెల్లడించడంతో ఈసారి ఖచ్చితంగా ప్రతి రైతులకు 48 గంటల్లో మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుందన్నారు. దళారులను ఆశ్రయించి ధాన్యం విక్రయించవద్దని ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట డీఎస్‌వో ప్రేమ్ కుమార్, సీఈవో మురళి, సెటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



బాణాసంచా పేలుస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : డబుల్ ఇంజన్ సర్కార్ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు.శుక్రవారం బీహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించిన నేపథ్యంలో బస్టాండ్ సెంటర్‌లో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీహార్ ప్రజలు ప్రధాని మోదీతో అభివృద్ధి సాధ్యమని నమ్మి నితిష్‌కుమార్ అభివృద్ధి మంత్రానికి మరోసారి పట్టంకట్టారని, 202 స్థానాలు గెలిచి ఎన్డీఏ కూటమి చరిత్ర సృష్టించిందన్నారు. ఓట్ చోరీ పేరుతో అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీకి బీహార్ ప్రజలు దిమ్మ తిరిగే తీర్పు ఇచ్చారని, కేవలం 4సీట్లకే పరిమితమై బుద్ధిచెప్పారన్నారు. మోదీ నాయకత్వంలో ఎన్డీఏ కూటమి అభివృద్ధి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె కుమార్, కొలుపుల శంకర్, అలిసేరి రవిబాబు, యాకయ్య, శేఖర్, సాయిముఖేష్, రాజు, నవీన్, సందీప్, భరత్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ సంబరాలు

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నేపథ్యంలో శుక్ర వారం తొర్రూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సంద ర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ తీర్పు కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పయ్యావుల ప్రవీణ్ యాదవ్, సదాకర్, రవీంద్రచారి, ఉష, వెంకన్న, దేవేందర్ రాజు, నల్లపు రాజు, మహేశ్వరి, రాణి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఇండ్లు పంపిణీ చేయాలని దీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

తొర్రూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో నిర్మించి ఉన్న ఇండ్లను పంపిణీ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులు రీలే నిరాహార దీక్షలు శుక్రవా రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.నాగయ్య హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 280 ఇళ్లు పంపిణీ చేయాలని కోరుతూ గత ఆరు నెలలుగా పార్టీ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా నిరసన తెలిపినా పంపిణీ చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.

అర్హులైన వారికి ఇండ్లు పంపిణీ చేసి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ఇళ్ల పంపిణీని రాజకీయంగా చూడకుండా పేదల పోరాటంగా చూసి నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించి వెంటనే పంపిణీ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వంలో అనేక పట్టణాల్లో ఇళ్ల పంపిణీ చేపట్టారని, తొర్రూరులో కూడా పంపిణీ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, నాయకులు అశోక్, యాకూబ్, దర్గయ్య, అమీర్, వెంకటేశ్వర్లు, శంకర్, శోభ, నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రైతులకు సబ్సిడీపై స్ప్రేయర్లు

దంతాలపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రైతులకు తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేయనుందన్నారు. ఈ సందర్భంగా ఆసక్తి గల రైతులు మండలంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు అందించాలన్నారు. హోండా తైవాన్ స్ప్రేయర్‌కు రూ.23,900 ఉండగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.13,900కు అందిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు వెంటనే ఏఈవోలను సంప్రదించాలన్నారు.

'రుద్రమదేవి' అక్రమార్కులపై చర్యలు

జనగామ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుద్రమదేవి మహిళా మాక్స్ సొసైటీకి సంబంధించిన భూమి కొనుగోలుపై జరిగిన అవకతవకలపై బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని స్పెషల్ అఫీషియల్ ఇన్‌చార్జీ దివ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుద్రమదేవి మహిళా మాక్స్ సొసైటీకి సంబంధించిన సభ్యురాలు పొదుపులు, అప్పులు లావాదేవీలపై ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా ప్రభుత్వం పర్యవేక్షణలో అన్ని వ్యవహారాలను ముందుడి నిడిపిస్తుందని స్పష్టం చేశారు. అవకతవకలపై ఇప్పటికే చర్యలు ప్రారంభించామని కోర్టు ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సంఘానికి సంబంధించి రూపాయి కూడా నష్ట పోకుండా సభ్యురాళ్లకు భరోసా ఇచ్చారు. రుద్రమదేవి మహిళా మాక్స్ సొసైటీ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో సజావుగా కొనసాగుతుందని ఉద్యోగులకు సభ్యురాళ్ల పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

పెద్దవంగర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్యాల, అవుతాపురం గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం హెచ్‌ఎంలు విజయ్‌కుమార్, కళాధర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వయం పరిపాలన ద్వారా బోధన అనుభవం, జ్ఞాపకాలు ఎప్పటికి చిరస్థాయిగా ఉంటాయన్నారు. విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ కోసం క్రమశిక్షణతో చదవాలని కోరారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులందరూ బాగా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

దంతాలపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాట్ల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలమేళాతో పాటు సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రదర్శించి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వ హించారు. అనంతరం నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో దాట్ల ప్రధానోపాధ్యాయుడు పాషా, ఉపాధ్యాయులు రవీందర్, కవిత ఇతర ఉపాధ్యాయ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ స్కూల్స్ సమస్యలను పరిష్కరించాలి

మరిపెడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ స్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘ బాధ్యులతో కలిసి మరిపెడ ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో టీపీటీఎఫ్ పోరాట పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘ బాధ్యులు మహేశ్వర్, భాస్కర్, ఆశ్రమ స్కూల్ బాధ్యులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో జిమ్ ప్రారంభం



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామంలో గల తెలంగాణ స్పెషల్ పోలీస్ ఐదవ బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్, ఓపెన్ జిమ్‌ను జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వ్యవస్థ పనితీరును, పరికరాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కలెక్టర్ తరఫున వచ్చే సహాయం ఎల్లవేళలా అందిస్తామన్నారు.

కార్యక్రమం లో అడిషనల్ కమాండెంట్ బి.సీతారాం, అసిస్టెంట్ కమాండెంట్‌లు అనిల్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీనివాసచారి, భాస్కర్, స్వామి, సాయిబాబు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, అశోక్, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బానోత్ రవిచందర్

ములుగు రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులకు సహకరించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ సదుపాయం, బరువులు కొలిచే యంత్రాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పల్లె జైపాల్‌రెడ్డి, డీఆర్‌డీపీ శ్రీనివాస్, ఏపీఎం శ్రీనివాస్, సీసీ భూక్య కవిత, ఇన్‌చార్జి పోరిక సునీత, సభ్యులు వాగావత్ సుశీల, పోరిక అనిత, పోరిక దీపిక, కందకట్ల సంధ్యారాణి, కందకట్ల చంద్రకళ, శ్రీదేవి, మాజీ సర్పంచ్ బాబురావు, పోరిక దేవేందర్, నేత సాగర్, ఆత్మ చైర్మన్ రవీందర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

● శాతవాహన యూనివర్శిటీ ప్రిన్సిపాల్ సుజాత



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాతవాహన వర్సిటీ ప్రిన్సిపాల్ సుజాత

మహాముత్తారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందించాలని శాతవాహన యూనివర్శిటీ ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత అన్నారు. మండలంలోని యామన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్శిటీ ప్రిన్సిపాల్, రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు సుజాత హాజరై మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన వర్గాల విద్యార్థులే ఎక్కువగా ఉంటారని తెలిపారు. వారిని ఉన్నత స్థితికి తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సురేందర్, ప్రభాకర్, రత్నకుమారి, ఉపాధ్యాయులు తిరుపతి, అమీన్, రజినీ, అపర్ణ పాల్గొన్నారు.

హమాలీ కూలీ రేట్లు పెంచాలి

వెంకటాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హమాలీ కార్మికులు కూలీ రేట్లు పెంచాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచడం జరుగుతుందని, ఈ ఏడాది కూడా పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఐకేపీ, పీఏసీఎస్ తదితర ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాడుకట్టు మామూలు ఇవ్వాలని కోరారు. హమాలీ కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఇన్సూరెన్స్ చేయించాలని, హమాలీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అలువాల ఐలయ్య, రాములు, రమేష్, శ్రీధర్, అనిల్, శేఖర్, నక్క సదయ్య, అల్లం కుమార్, నక్క ఐలయ్య, సుధాకర్, లింగయ్య, పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



ఐటీడీఏ ఏపీవో వసంతరావుకు వినతి పత్రం అంతజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏటూరునాగారం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్టీ ఎస్ఎంఎస్ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించని వార్డెన్‌పై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ డిమాండ్ చేశారు. శుక్రవారం ఐటీడీఏ ఏపీవో వసంతరావుకు ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. ఎస్టీ ఎస్ఎంఎస్ కళాశాల హాస్టల్‌లోని విద్యార్థులకు గడచిన కొంత కాలంగా నాణ్యత లేని, ఉడకని ఆహారాన్ని భోజనంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

దీనివల్ల విద్యార్థులు కడుపునొప్పి వంటి ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. హాస్టల్‌కు 500 మీటర్ల దూరంలో ఐటీడీఏ ఉన్నప్పటికీ అధికారులు ఇప్పటి వరకు హాస్టల్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే హాస్టల్‌ను సందర్శించి అధికారులపై విచారణ జరిపి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యత పాటించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలు, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు బుర్క వంశీ, తల్లడి సంతోష్, కొప్పుల వినీత్, కోగిల సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన నెదర్లాండ్ దేశస్థులు



దేవాలయం ఆవరణలో నెదర్లాండ్ దేశస్థులు

వెంకటాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేటలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం నెదర్లాండ్ దేశానికి చెందినజోహన్-హలేన్ దంపతులు సందర్శించారు. వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళను వీక్షించి చరిత్ర, విశిష్టతను గైడ్ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేట్ ఆర్కిటెక్చర్, బ్యూటిఫుల్ టెంపుల్ రామప్ప అని కొనియాడారు. అక్కడి నుంచి వారు సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేశారు. వారి వెంట దేవాదాయ, టూరిజం, పురావస్తు శాఖల సిబ్బంది, టూరిస్ట్ పోలీసులు శ్రీనివాస్, అరుణ్, శ్రీకాంత్, దశరథ్, భద్రు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాజయ్య(ఫైల్)

మల్హర్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన తాడిచర్లలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొయ్యూర్ పోలీసులు తెలిపిన ప్రకారం... తాడిచర్ల గ్రామానికి చెందిన గాదనవేన రాజయ్య(48) అనే వ్యక్తి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మంథనిలో బంధువుల వివాహం ఉండటంతో ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే రోజు పెద్దతూండ్లలోని బంధువుల ఇంట్లో పెద్దేవర కొలుపు ఉండటంతో అక్కడికి వెళ్లాడు. అక్కడి నుంచి రాత్రి 7.30 గంటల ప్రాంతంలో తాడిచర్లకు బయలుదేరినట్లు తెలిపారు. రాత్రి అయినా రాజయ్య ఇంటికి రాకపోయే సరికి కుటుంబీకులు ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. శుక్రవారం ఉదయం పెద్దతూండ్ల, తాడిచర్ల రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో రాజయ్య మృతి చెందిఉన్నట్లు తెలిపారు. రాజయ్య మృతికి గల కారణాలు తెలుసుకోవాలని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలికలకు ఆరోగ్యంపై అవగాహన

రేగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో శుక్రవారం గివ్ ఫర్ సొసైటీ సంస్థ ఆర్థిక సహకారంతో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ శ్వేత హాజరై బాలికలకు సానిటరీ ప్యాడ్స్ అందచేసి మాట్లాడుతూ రుతుస్రావ సమస్యను ఎలా ఎదుర్కోవాలో కిషోర బాలికలు భావితరాలకు తెలియచేయాలని సూచించారు. సంస్థ సభ్యులు సత్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ పాల్గొన్నారు.



ఖాళీల భర్తీ కలేనా ?

- వరంగల్ జిల్లా వ్యాప్తంగా 919 అంగన్‌వాడీ కేంద్రాలు
- జిల్లాలో 66 టీచర్, 284 ఆయా పోస్టులు ఖాళీ
- టీచర్లపై అదనపు భారం
- ఎదురుచూస్తున్న ఆశావహులు

వరంగల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా ? అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. వరంగల్ ప్రాజెక్టు పరిధిలో 24 టీచర్, 64 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అదేవిధంగా వర్ధన్నపేట ప్రాజెక్టు పరిధిలో 20 టీచర్, 127 ఆయా పోస్టులు, నర్సంపేట ప్రాజెక్టు పరిధిలో 22 టీచర్, 93 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తం వరంగల్ జిల్లాలో 66 టీచర్ పోస్టులు, 284 ఆయా(హెల్పర్లు) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆశావాహులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ టీచర్లకే పక్కన ఉన్న కేంద్రాలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

వరంగల్ జిల్లాలో మొత్తం 919 కేంద్రాలు..

వరంగల్ జిల్లాలో వరంగల్, వర్ధన్నపేట, నర్సంపేట ప్రాజెక్టుల పరిధిలో 37 సెక్టార్లతో 919 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 4,019 మంది గర్భిణులు, 4,562 మంది బాలింతలు, 7,796 మంది బడి పిల్లలు, 47,548 మంది ఆరు సంవత్సరాలలోపు చిన్నారులు ఉన్నారు. 21,878 మందికి పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందిస్తున్నారు. టీచర్లకు నెలకు రూ.13 వేలు, ఆయాలకు రూ.7,800 వేతనం ఇస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో చివరిసారిగా 2020-21లో ఖాళీ పోస్టులను భర్తీ చేసినప్పటికీ అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు 65 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ చేయాలని గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2023 నవంబరు నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీ చేయకపోవడంతో వాటిపై ఆశలు పెట్టుకున్న మహిళలు ఆందోళన చెందుతున్నారు.



త్వరలో నోటిఫికేషన్ వస్తుంది..
- బి.రాజమణి, జిల్లా సంక్షేమాధికారి

రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సమాచారం ఉంది. ఇప్పటికే జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్, ఆయా పోస్టుల వివరాలు సేకరించాం. కొన్ని కేంద్రాల్లో టీచర్లకే అదనపు బాధ్యతలు అప్పగించాం. ఆయాలు లేని కేంద్రాల్లో కూడా టీచర్లే పని చేస్తున్నారు.

సక్రమంగా అందని పౌష్టికాహారం..

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురి కాకుండా, శారీరకంగా బలహీనపడకుండా ఉండేందుకు అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రతీరోజు పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్డుతో పాటు ఆకుకూరలు, ఇతర కూరలతో పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందుతుంది. అదేవిధంగా ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను కూడా అంగన్‌వాడి టీచర్లకే అప్పగిస్తుంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడంతో వారిపై అదనపు పనిభారం పడుతున్నది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయాలు లేని కేంద్రాల్లో టీచర్లకు సర్వే బాధ్యతలు అప్పగించడంతో కేంద్రాలు మూతపడే ప్రమాదం ఉంది.

మారిన నిబంధనలు..

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత నిబంధన ఉండేది. కానీ కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలని నిబంధన పెట్టింది. వయో పరిమితి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలని పేర్కొంది. ఖాళీల్లో 50 శాతం ఆయాలకు పదోన్నతి ద్వారా భర్తీ చేయాలని నిబంధనల్లో పేర్కొంది. అయినా కూడా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆశావహులు కళ్లల్లో వత్తులేసుకుని ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడి కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ మహిళలు కోరుతున్నారు.


ఆచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణారావు, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, రాజగోపాలచార్య

నిఖార్సయిన జర్నలిజం

ప్రజలపక్షం వహిస్తుంది..

ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ కృష్ణారావు

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్యాయాలను ప్రశ్నించే వారందరూ జర్నలిస్టులేనని ప్రముఖ కవి, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు అభిప్రాయపడ్డారు. నగరలోఓని కేయూ పరిపాలన భవనంలో శుక్రవారం వరంగల్ మొదటి తరం జర్నలిస్టు, జనధర్మ ఎడిటర్ ఎంఎస్ ఆచార్య 7వ స్మారక ఉపన్యాసం జరిగింది. వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రాంచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొదటగా ఎంఎస్ కుటుంబ సభ్యులు ప్రొఫెసర్ రాజగోపాలచార్య, మాడభూషి శ్రీధరాచార్యులతో కలిసి ఎంఎస్ ఆచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణారావు... 'జర్నలిజం- మారుతున్న ప్రమాణాలు' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు.

రామాయణ, మహాభారత కావ్యాలన్నీ సమాజంలో చెడుపై మంచి సాధించే విజయాన్ని చెబుతున్నాయన్నారు. జర్నలిజం ఎల్లప్పుడూ సమాజంలో మంచిని పెంచి ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. సమాజంలో భిన్నాభిప్రాయాలు కలిగిన వర్గాలు వారికి అనుకూలమైన సంపాదకీయాలను అదరించేవారన్నారు. గోరా శాస్త్రి, వావిలాల గోపాలకృష్ణయ్య, ఏటీకే ప్రసాద్ లాంటి అనేక మంది ఉద్ధండులు జర్నలిజంలో విలువను పెంపొందించేందుకు చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు.

వార్తకు రంగు, రుచి, వాసన ప్రధానం కాదని వాస్తవికతే ప్రాణమన్నారు. జర్నలిస్టులకు సమాజంపై సునిశిత పరిశీలన ఉండాలని, సబ్జెక్టుపై పట్టు ఉండాలని సూచించారు. విషయంపై జర్నలిస్టులకే స్పష్టత లేకపోతే సమాజానికి ఏం చెబుతారని ప్రశ్నించారు. భారతీయ సంస్కృతి, ఆచారాలు గొప్పవని, అయితే మతం, కులం పేరుతో రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు. ప్రస్తుతం దేవుడిని రాజకీయాల కోసం వాడుకునే పరిస్థితులు తలెత్తాయన్నారు. అవగాహనతో రాసే రచనే సాహిత్యమని, కవులకు, జర్నలిస్టులకు భాషపై పట్టు ఉండాలని సూచించారు.

తెలుగు జర్నలిజంలో ఆచార్య సేవలు గొప్పవని కీర్తించారు. సమాజ స్పందనను జర్నలిస్టులు తమ వార్తల్లో ప్రతిబింబింపచేస్తారన్నారు. అనేక మంది జర్నలిస్టులను ఎంఎస్ ఆచార్య తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కేయూసీ, కేఎంసీ, ఆర్‌ఈసీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకు ఆచార్య జర్నలిజం తోడ్పడిందన్నారు. ప్రజాస్వామ్య సుస్థిరతకు పత్రికలు సాధనాలని, జర్నలిస్టులు తటస్థంగా వ్యవరించాలని సూచించారు. యువత సమాజంలోని దుర్మార్గాలను, వివక్షను ప్రశ్నించాలన్నారు. సమాజంలో అంబేద్కర్ చూపిన మార్గం శ్రేయస్కరమన్నారు.

కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజం బాధ్యత గొప్పదని, అయితే బ్లాక్‌మెయిల్, దోపిడీ ఘటనలు సమాజాన్ని పెడదోవ పట్టిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. అంతకుముందు రిజిస్ట్రార్ వల్లూరి రాంచంద్రం కృష్ణారావును సభకు పరిచయం చేశారు. ఎం.రాజగోపాలచారి, శ్రీధరాచార్యులు మాట్లాడుతూ.. ఎంఎస్ ఫౌండేషన్ కార్యకలాపాలను, ఎంఎస్ రచనలను వివరించారు. అనంతరం కృష్ణారావును ఘనంగా సన్మానించారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొఫెసర్ చింతకింది రాజేశం, కాత్యాయని విద్మహే, మామిడి లింగయ్య, ప్రొఫెసర్ మల్లారెడ్డి, కట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల పంచాయితీతోనే

కవిత బయటకు వెళ్లింది..

- జూబ్లీహిల్స్‌లో గెలుపు సీఎం రేవంత్‌రెడ్డి పాలనకు నిదర్శనం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత పది ఏళ్లలో ఎమ్మెల్యే మొదలుకొని సీఎం వరకు, కల్వకుంట్ల కుటుంబం వరకు తెలంగాణపైన పడి దోచుకున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. శుక్రవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 198 మంది లబ్ధిదారులకు రూ.1.05 కోట్ల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబంలో ఆస్తుల పంచాయితీ వచ్చిందని, అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న వేలకోట్ల రూపాయల సొమ్ములో తన వాటా ఇవ్వడం లేదని కవిత బహిరంగంగా మాట్లాడిందని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు కవిత మీ పైన చేస్తున్న ఆరోపణల పైన సమాధానం చెప్పిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఆరోపణలు చేయాలన్నారు. ఇటీవల కవిత మాట్లాడుతూ వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి రూ.1100 కోట్లు మంజూరు చేస్తే అవి సరిపోవని హరీశ్‌రావు అంచనాలను రూ.1700 కోట్లకు పెంచి రూ.600 కోట్లు అక్రమంగా దోచుకున్నాడని తెలిపారన్నారు. వీటికి సమాధానం ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పైన అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ మెజార్టీతో గెలుపొందడం ప్రభుత్వ తీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనకు నిదర్శనమన్నారు. 2023 ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానం కూడాగెలుచుకోలేదని, అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీకి రెఫరెండమని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మేడారం బస్సులకు టికెట్ ధరలు ఖరారు

హనుమకొండ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే మేడారం జాతరకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ వరంగల్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ. 130, పిల్లలకు రూ. 80, ఎక్స్‌ప్రెస్ బస్సులకు టికెట్ ధర పెద్దలకు రూ. 180, పిల్లలకు రూ. 110 ఖరారు చేసినట్లు తెలిపారు. అలాగే హనుమకొండ బస్టాండ్ నుంచి మేడారానికి వెళ్లే భక్తుల కోసం నవంబరు 16న ఆదివారం హనుమకొండ బస్టాండ్ నుంచి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పల్లె వెలుగు బస్సులు ఉదయం 6.10, 7, 8, 9, మధ్యాహ్నం 12.10, 1, 1.40, 2.30, రాత్రి 8. 20 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని, మేడారం నుంచి హనుమకొండకు ఉదయం 5.45, 9.45, 10.15, 11.15, సాయంత్రం 3.15, 4.17, 5.30, 6 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని, వారు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి

తెలంగాణ పత్తి రైతుల సంఘం నేతలు » సీసీఐ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా



శివనగర్‌లో సీసీఐ రీజినల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఖిలా వరంగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భూక్యా చందు నాయక్, రాష్ట్ర కో-కన్వీనర్ మూడ్ శోభన్ నాయక్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్‌లోని సీసీఐ వరంగల్ రీజినల్ కార్యాలయం ఎదుట పత్తి రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తేమతో నిమిత్తం లేకుండా సీసీఐ ద్వారా రైతులు పండించిన పత్తిని ఎక్కడైనా స్వేచ్ఛగా విక్రయించే అవకాశాన్ని కల్పించాలన్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పత్తిపై 11 శాతం సుంకాన్ని ఎత్తివేయడాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కపాస్ కిసాన్ యాప్ వలన కౌలు రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీసీఐ ఆధ్వర్యంలో గతంలో మాదిరిగా ప్రతీ ఎకరాకు 12 క్వింటాల్ కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ క్వింటాల్‌కు రూ. 475బోనస్ అమలు చేయాలన్నారు. మ్యాపింగ్ పద్ధతిని అమలు చేయొద్దని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీసీఐ వరంగల్ రీజినల్ డిప్యూటీ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు, రాష్ట్ర కో-కన్వీనర్ పి. కృష్ణారెడ్డి, చెల్పూరి రాము, రజనీకాంత్, రాష్ట్ర నాయకులు బొబ్బ వెంకటరెడ్డి, నల్లపు సుధాకర్, మార్తినేని పాపారావు, చల్ల నరసింహారెడ్డి, కోరబోయిన కుమారస్వామి, రామావత్ మీట్యా నాయక్, గారంపల్లి సంతోష్, ప్రతాపనేని వెంకటరెడ్డి, రమేష్, కాసాని సిద్ధులు, కొత్త వెంకట్‌రెడ్డి, మద్దెని రామచొక్కం, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, బురానుద్దీన్, రాజయ్య, వాసుదేవ్, రైతులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- నర్సంపేటలో ధర్మశాస్త్ర ఆలయంలో మండల పూజ మహోత్సవం ప్రారంభం
- మహాన్నదానం ప్రారంభించిన కమిటీ సభ్యులు
- డిసెంబరు 15న మహా పడిపూజ

నర్సంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నర్సంపేటలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో డిసెంబరు 27 వరకు జరుగనున్న 25వ మండల పూజ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ పైసా సురేశ్ కమిటీ సభులతో కలిసి శుక్రవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 5.15 గంటలకు సుప్రభాత సేవ కార్యక్రమంతో మండల పూజ ప్రారంభమైనట్లు తెలిపారు. గూడ రామకృష్ణశర్మ, అతని కుమారులు పవన్‌శర్మ, హరీశ్ శర్మలు వేదమంత్రోచ్ఛరణల నడుమ మహా గణపతి హోమం, ఓంకార ధ్వజారోహణం, గోపూజ, హోమగుండ ఆవిర్భావం, సుదర్శన హోమపూజలను మాలధారులు, భక్తులతో చేయించారన్నారు. 15న మహాధ్వజారోహణం, పుష్పాభిషేకం, మహాపడిపూజ నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 1, 2, 4, 6 తేదీలలో దాతలచే పష్పాభిషేకం పడిపూజలను ఆలయ అర్చకుడు దినేశ్‌మిశ్రా నిర్వహిస్తారన్నారు. 8న పల్లివేట కార్యక్రమం, 9న మాధన్నపేటలో పంబా ఆరాట్ వేడుకలను దాతలతో గురుస్వామి వెంకటేశ్‌శర్మ వైభవంగా నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జనవరి 1న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి-సునంద దంపతులతో పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. మహాన్నదాన కార్యక్రమం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నిర్వహిస్తామని వారు వివరించారు.


హోమం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు

మహాన్నదానం ప్రారంభం

ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు నర్సంపేట మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ చైర్మన్ పైసా సురేశ్ కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోనెల రవీందర్, కార్యదర్శి బూరల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవునూరి అంజయ్య, నర్సంపేట డివిజన్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందం నరేందర్, కార్యదర్శి ఎస్.మాధవశంకర్, కోశాధికారి కురంగడ్ల రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక నైవేద్య పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు మాధారపు చంద్రశేఖరం, చింతల కమలాకర్ రెడ్డి, కొమాండ్ల బూపాల్‌రావు, దొడ్డ రవీందర్, అనంతుల రాం నారాయణ, భూపతి లక్ష్మీనారాయణ, మల్యాల ప్రవీణ్, మల్యాల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- ఎన్‌హెచ్‌ఎం నాయకుడు రుక్ముద్దీన్
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం జిల్లా నాయకులు ఎండీ రుక్ముద్దీన్, డాక్టర్ అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలని అన్నారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయడంతో పాటు మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ ధర్నాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జిల్లా నాయకులు మహేందర్, సురేష్, నవీన్‌కుమార్, వినోద్‌కుమార్, రాజేంద్రప్రసాద్, అనిత, విజేత, సుష్మ, అనూష, కనిష్క, ప్రవీణ్, సుదర్శన్, వినోద్, రాకేష్, నరేష్, రహమాన్, సందీప్‌కుమార్‌తో పాటు డీపీఎంయూ, పీడీఎంఓఎస్, డీటీసీవో, జీఎంహెచ్, మిడ్ వైఫొరిస్, ఎస్ఎన్‌సీయూ, సీఎల్‌ఎంసీ, టీ-హబ్, ఏఎన్‌ఎంలు, నర్సింగ్ ఆఫీసర్లు, ఎల్‌టీ, అకౌంటెంట్లు, సీవోలు, అటెండర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో జోష్

(5వ పేజీ తరువాయి)


ఎన్నికలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. బీసీ లకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను ఇటీవల సుప్రీంకోర్టు కొట్టివేయటంతో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలపై డైలామలో పడింది. అయితే పార్టీ పరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చి, లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని పార్టీ భావిస్తోందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దక్కిన విజయం భారీ ఊపునిచ్చినట్టయింది. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత లేదనే సంకేతాలను ఓటర్లు ఇచ్చారనే చర్చ పార్టీలో జరుగుతుంది. గెలుపు ఊపులో ఉన్నప్పుడే లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని పార్టీ శ్రేణులు కూడా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 6జడ్పీ చైర్మన్‌లను గతంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసింది. ఈసారి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో అధిష్ఠానం ఉంది. మెజార్టీ ఎంపీపీ, జడ్పీటీసీలు, సర్పంచ్ స్థానాల్లో పాగా వేయాలనే వ్యూహంతో ప్రభుత్వం లోకల్ పోరుకు సైరన్ మోగించవచ్చునని కాంగ్రెస్ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి. దీనికి తోడు జిల్లా కాంగ్రెస్ కమిటీలను కూడా ఈ వారంలోనే ప్రకటించే అవకాశం ఉందని టాక్ వినబడుతోంది. మరోవైపు గత పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ గూటికి చేరిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ కోర్టును ఆశ్రయించింది. కోర్టు ఆదేశాలతో ఫిరాయింపులపై చర్యలు తీసుకునేందుకు స్పీకర్ సిద్ధం అవుతున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా.. ఎదుర్కొనేందుకు క్యాడర్ రెడీ అవుతోంది. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయంతో కాంగ్రెస్ శ్రేణులు జోరుగా విజయోత్సావాలు జరుపుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. దీంతో ఇది వారి వ్యక్తిగత విజయంగా భావించి సంబరాల్లో ఊరేగుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

ఐదుగురు టీచర్లు, డ్రైవర్‌కు గాయాలు





గాయపడిన టీచర్లు రాధిక, కళావతి, డ్రైవర్ మల్లేష్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురం శివారు కుమ్మరికుంట తండా వద్ద శుక్రవారం ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఐదుగురు ఉపాధ్యాయినీలు, ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. గంగారం మండలం మర్రిగూడెంకు చెందిన మద్దెల సింధూజ, డోర్నకల్ మండల కేంద్రానికి చెందిన సాంపల్లి స్వరూప, కుంటిగొర్ల రాధ, వరంగల్ జిల్లా చెన్నరావుపేటకు చెందిన వేర్పులకొండ శైలజ, మానుకోట పట్టణానికి బానోత్ కళావతి (ఐదుగురు టీచర్లు), నేరడలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం వారు మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆటోలో కురవి మండలం నేరడ కేజీబీవీ పాఠశాలకు వెళ్తున్నారు. బోరింగ్ తండాకు చెందిన ట్రాక్టర్ ఇసుక లోడుతో చిన్నగూడూరు నుంచి మానుకోట వస్తుండగా శనిగపురం శివారు కుమ్మరికుంటతండా మలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు టీచర్లతో పాటు పర్వతగిరికి చెందిన ఆటోడ్రైవర్ పచ్చిపాల మల్లేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో తీవ్రంగా గాయపడ్డ డోర్నకల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు రాధ, మానుకోటకు చెందిన కళావతిని ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ఖమ్మంకు తరలించారు.

ఎస్డీఎల్‌సీఈ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ దూర విద్యకేంద్రం వార్షిక పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం వర్సిటీ పరిపాలన భవనంలో ఫలితాలను విడుదల చేశారు. బీఏలో మొదటి ఏడాదిలో 8శాతం, రెండో, మూడో ఏడాదిలో 14శాతం, బీబీఏ మొదటి ఏడాదిలో 10శాతం, రెండో, మూడో ఏడాదిలో 11 శాతం, బీకామ్ మొదటి, రెండో ఏడాదిలో 25 శాతం, మూడో ఏడాదిలో 26శాతం, ఎంఎస్సీ సీఎస్ మొదటి ఏడాదిలో 7, రెండో ఏడాదిలో 8 శాతం, మూడో ఏడాదిలో 11 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక

కన్నాయిగూడెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) సమావేశం శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాగణంలో జిల్లా అధ్యక్షుడు చందా మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలం రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా రాయకంటి కిరణ్, ఉపాధ్యక్షులుగా తూారం చొక్కారావు, మడప వెంకటేష్, కోశాధికారిగా చిడం రవి ఎన్నికయ్యారు. సమావేశంలో కాపుల సమ్మయ్య, పొడెం నర్సింగారావు, సోలం సురేష్, నల్లబోయిన గంగాధర్, వాసం నరేందర్, మడప సంతీప్, ఆలం ముత్యాలరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

డీలర్లు కాంటాతో బియ్యం తీసుకోవాలి

- సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి

వెంకటాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీసీసీ గోదాం నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలించే సమయంలో డీలర్లు తప్పకుండా కాంటా పెట్టుకున్న తర్వాతనే తీసుకెళ్లాలని సివిల్ సప్లయీస్ డీఎం రాంపతి అన్నారు. వెంకటాపురం మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ముందుగా మండలకేంద్రంలోని జీసీసీ గోదాంను సందర్శించి బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కాంటాలు పెట్టకుండా బియ్యం తరలిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట జీసీసీ మేనేజర్ స్వామి తదితరులు ఉన్నారు.

శారదా విద్యాలయంలో బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

పరకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):పరకాల పట్టణంలోని శారదా విద్యాలయంలో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పాఠశాలలో చిన్నారులు తమ ఉపన్యాసాలు, ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ చాచా నెహ్రూ జీవితంలోని సంఘటనలు, పంచశీల ఒప్పందం, పంచవర్ష ప్రణాళికలు, విదేశాంగ విధానం, ఆయన నిబద్ధత గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాంటి మహనీయుని జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజిని, నిరోష, రజిని, రజిత, మంజుల, సుమన్, సారంగపాణి, నాగరాజుపాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ములుగులోని జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్, జవహర్‌లాల్ నెహ్రూ, సరస్వతీ అమ్మవారి చిత్ర పటాలకు పూలమాల వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ గ్రంథాలయానికి విచ్చేస్తున్న పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, కృష్ణబాబు, ఎస్.నిఖిల్, బి.సమ్మక్క పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రగతి

వాజేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం ఎంపీయూపీఎస్ పాఠశాలలో శుక్రవారం ఎంఈవో వెంకటేశ్వర్లు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రుల ముందు చూపించారు. అలాగే విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు పదాలను రాయించారు. తక్కువ సమయంలో ఎక్కువ పదాలు రాసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలాజీ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్‌పర్సన్ నాగరాణి పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పించాలి

వాజేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బోదెబోయిన సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం పాఠశాలతో పాటు పలు పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

కాటారం డివిజన్‌కు 500 కుట్టుమిషన్లు రాక

(5వ పేజీ తరువాయి)

సామాజిక బాధ్యత) కింద ప్రముఖ కుట్టు మిషన్ల కంపెనీ ఉష సహకారంతో కుట్టుమిషన్లు అందజేయడానికి చర్యలు తీసుకున్నారు. ఇటీవల డివిజన్ స్థాయిలో వడ్డీ లేని రుణాల పంపిణీలో భాగంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ స్వశక్తి సంఘాలతో పాటు పలువురు మహిళలు కుట్టు శిక్షణతోపాటు మిషన్లను అందజేస్తామన్న హామీ మేరకు మిషన్లు మండల కేంద్రాలకు చేరాయి. దీంతో మొదటి విడతగా ఐదు మండలాల పరిధిలో కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు కుట్టులో మెళకువలు నేర్పడానికి 500 కుట్టు మిషన్లను కంపెనీ పంపించింది. మండలకేంద్రాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి కుట్టు శిక్షణ అందించేలా డీఆర్‌డీఏ అధికారులు, స్థానిక ఐకేపీ అధికారులు, సిబ్బందితోకలిసి చర్యలు చేపట్టారు. కాటారం రైతు వేదికలో కుట్టు శిక్షణ కోసం తొలి విడతలో 50 మిషన్లను ఏర్పాటు చేశారు. కాగా, కుట్టుశిక్షణ కోసం ఎంపికైన మహిళలకు త్వరలో శిక్షణా కార్యక్రమాలు ప్రారంభిస్తారని డీఆర్‌డీవో బాలకృష్ణ తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు

- జూబ్లీహిల్స్‌లో గెలుపుతో స్వీట్లు పంపిణీ



ములుగులో సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

ములుగు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపొందడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద శుక్రవారం బాణసంచా కాల్చి విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో క్రికెట్‌అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కుంజా సూర్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, నాయకులు నల్లెల్ల భరత్‌కుమార్, తిరుపతిరెడ్డి, ఒజ్జల కుమార్, సయ్యద్ షకీల్ అహ్మద్, బొక్క సత్తిరెడ్డి పాల్గొన్నారు.

- మంగపేట(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో స్వీట్లు పంచారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, వర్కింగ్ కమిటీ మండల ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, మైనారిటీ మండల అధ్యక్షుడు టీవీ హిదయతుల్లా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ నాయకులు మండవ రామకృష్ణ, తుడి భగవాన్‌రెడ్డి, సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.
- ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయంతో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ములుగు జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, నాయకులు వావిలాల చిన్నఎల్లయ్య, ఎమ్డీ.ఖలీల్‌ఖాన్, సరికొప్పుల శ్రీనివాస్, ముక్కెర లాలయ్య, ఎమ్డీ.గౌస్ పాషా, చెన్నూరు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- గోవిందరావుపేట(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు.నాయకులు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, మద్దాలి నాగమణి, దాసరి సుధాకర్, జెట్టి సోమయ్య, రసూ్పత్ సీతారాంనాయక్, తేళ్ల హరిప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.
- వెంకటాపురం(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడం పట్ల మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం శివ, నాయకులు సాయి, పిళ్లారిశెట్టి మురళి, మద్దుకూరి ప్రసాద్, క్రాంతి, కాల్వ సుందర్‌రావు, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.
- వాజేడు(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ విజయం పట్ల వాజేడు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు జరిపారు. మండల కేంద్రంతో పాటు పేరూరులో కాంగ్రెస్ శ్రేణులు విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథప్రసాదబాబు రాజులు కార్యకర్తలకు స్వీట్లు తినిపించారు. నాయకులు వత్సవాయి జగన్నాథరాజు, తల్లడి ఆదినారాయణ, దాట్ల సీతారామరాజు, కాకర్లపూడి కల్యాణ్, నల్లగాసి రమేష్, చెన్నం ఎల్లయ్య, ఎస్‌కే ఖాజావళి, కాశీకృష్ణ, చెన్నం రామ్మూర్తి, వెంకటేశ్వర్లు, సుధీర్ పాల్గొన్నారు.



కాటారంలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

- తాడ్వాయి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గెలుపు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపొందగా గ్రామాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.
- భూపాలపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో వేడుకలు జరుగగా నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబురాలు చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవన్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న పనులను గుర్తించి ప్రజల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికే పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్, నాయకులు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవి, సాంబమూర్తి, తాటి అశోక్, భూమయ్య, రాజేష్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, మదన్మోహన్, బాలరాజు, రమేష్, సదానందం పాల్గొన్నారు.
- గణపురం(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించిన నేపథ్యంలో గణపురంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా టపాసులు పేల్చి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్కూరి శ్రీనివాస్, చోటేమియా, క్రిష్ణ, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.
- కాటారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,729 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంపై హర్షాతిరేకాలతో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, నాయకులు తెప్పల దేవేందర్‌రెడ్డి, అజీజ్, వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్, రఘు, రాజు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం..

చిట్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల హామీలను అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముచినిపర్తి గ్రామంలో కోలె కృష్ణవేణి-తిరుపతి దంపతులు ప్రభుత్వ సహాయంతో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రారంభించారు. మొదటి విడత లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం విడతల వారీగా బిల్లులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన కొనసాగుతుందని తెలిపారు. అనంతరం స్థానికులు, అధికారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలే ప్రభుత్వ ధ్యేయం

భూపాలపల్లిటౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల శాంతిభద్రతలే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాశీంపల్లి గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. భూపాలపల్లి పట్టణంలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కాశీంపల్లి ప్రాంతంలో పోలీసుల సూచన మేరకు ఏర్పాటు చేసిన 16 నూతన కెమెరాలు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ప్రతి వీధి మూలలో భద్రతా వలయం ఏర్పడి ప్రజలు నిశ్చింతగా జీవించేందుకు దోహదం చేస్తాయని తెలిపారు. భూపాలపల్లిని పూర్తిగా స్మార్ట్ అండ్ సెక్యూర్ సిటీగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సీఐ నరేష్, భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి, కాంగ్రెస్, లారీ అసోసియేషన్ నాయకులు తాటి అశోక్, జోరు వెంకటేశ్వర్లు, మంగళపల్లి బాలరాజు, ముత్యాల శ్యామ్, మైపాల్, రాము, శ్రావణ్, బండారి రవీందర్, డీ.రవీందర్, మేకల చంద్రయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

చిట్యాల సీఐ మల్లేష్

మొగుళ్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని చిట్యాల సీఐ మల్లేష్ అన్నారు. మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన ఇద్దరు కానిస్టేబుళ్లు మోహన్, భవానీ వరంగల్ విజిలెన్స్ డిపార్ట్‌మెంట్, టేకుమట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా, శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ వారిని శాలువాలతో సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికే సహకార సంఘాలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ఘనంగా సహకార వారోత్సవాలు ప్రారంభం

గణపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతో తోడ్పాటు నందిస్తున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండలంలోని చెల్పూరు పీఏసీఎస్ కార్యాలయంలో సహకార సంఘాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు సకాలంలో పంట రుణాలతో పాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందిస్తున్నాయని తెలిపారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు గండ్ర సత్యనారాయణరెడ్డి, కన్నెబోయిన కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరి క్రిష్టయ్య, సొసైటీ డైరెక్టర్లు తిరుపతిరావు, సంపత్‌రావు, నాయకులు కొత్త వెంకన్న, కావటి రవి, మల్హర్‌రావు పాల్గొన్నారు.

- రేగొండ(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జాతీయ వ్యవసాయ సహకార వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, సీఈఓ జగన్, నాయకులు నర్సయ్య, గంగుల రమణారెడ్డి, మోడెం జోష్‌గౌడ్, పున్నం రవి, కొలెపాక సాంబయ్య, ఎడ్ల మల్లారెడ్డి, భిక్షపతి, పాతుపల్లి సంతోష్ పాల్గొన్నారు.
- మల్హర్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన తాడిచర్లలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఇప్ప మొండయ్య సహకార జెండాను ఆవిష్కరించగా, సీఈవో సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.
- కాటారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సహకార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట చైర్మన్ తోటపల్లి ప్రశాంత్ పలువురు డైరెక్టర్లతో కలిసి ఏడు రంగుల తో కూడిన సహకార జెండాను



రేగొండలో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

ఎగరేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య, సంఘం డైరెక్టర్లు ఐలి రాజబాపు, జక్కుల అజయ్‌కుమార్, బండి రమేష్, బాసాని హిమాకర్, దండ్రు రాజయ్య, సీఈవో ఎడ్ల సతీష్, సిబ్బంది గోపాల్, అమీన్, సాంబమూర్తి, రాజబాపు, పవన్, కార్తీక్, శ్రీలత పాల్గొన్నారు.

- మహదేవపూర్(ఆంధ్రజ్యోతి): సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మహదేవపూర్ పీఏసీఎస్‌లో శుక్రవారం జెండావిష్కరించారు. సహకార సంఘం అధ్యక్షుడు చల్ల తిరుపతిరెడ్డి జెండా విష్కరించారు. మాజీ ప్రధాని నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు, సహకార సంఘం సభ్యులు తోట సుధాకర్, చీర్ల తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పోత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని సహకార సంఘాల సీఈవో జగన్నాథరావు అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటూరునాగారంలోని పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి సీఈవో ఎస్.జగన్నాథరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సహకార భావనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, తద్వారా రైతులు, మహిళలు, యువత, గ్రామీణాభివృద్ధి రంగాల్లో సహకార సంస్థల పాత్రను మరితం బలోపేతం చేయడం కోసమే ఈ వారోత్సవాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. సహకార సంఘం సిబ్బంది ఎమ్డీ.అజ్మద్ పాషా, ఎమ్డీ.పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

(5వ పేజీ తరువాయి)

ఘనంగా జరిగాయి. పలు పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంఈవో శ్రీదేవి,విద్యాలయాల ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు నాగలక్ష్మి, సునిత, రాజేందర్, గట్టయ్య, వెంకటలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రావు, వెంకటేశ్వర్లు, కార్తీక్‌రావు, వెంకటేష్‌గౌడ్, శ్రీశైలం, పృథ్వీధర్‌రావు, గోవర్ధన్, సోమలింగం, కృషిత, వందన, శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- గోవిందరావుపేట(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించేందుకు దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ముందుకు సాగాలని మండలంలోని చల్వాయి కేజీబీవీ ఎస్‌వో వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు జరుగగా ఆమె విద్యార్థులకు నెహ్రూ జీవిత విలువలను వివరించారు. కార్యక్రమంలో ఎల్‌సీపీవో సంజీవ, సోషల్ వర్కర్ జ్యోతి, హబ్ స్వప్న, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.
- గణపురం(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గణపురంలోని గ్లోబల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, కాంపిటేటివ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ క్రిష్ణ నెహ్రూ జీవిత చరిత్రను వివరించారు.
- తాడ్వాయి(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి గడ్డి శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేజ వేడుకలకు హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కొట్టం మల్లికాంబ, విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి రేగ కేశవరావు, ప్రధానోపాధ్యాయులు రేణుక, కృష్టయ్య, ఉపాధ్యాయులు శంకర్, లక్ష్మయ్య, వసంతరావు, స్వామి, ప్రవంత్, వనిత, నీలం బాబు, సారయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- చిట్యాల(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దేటటువంటి ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి అన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠ్యాంశాలు బోధించారు. స్థానిక పాఠశాలలో ఎంఈవో రఘుపతి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, సరళదేవి, నీలిమారెడ్డి, విజయలక్ష్మి, కల్పన, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు

ములుగు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. అంతకుముందు పార్టీ జెండాలు చేబూనిన నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు చేసిన మేలు మాత్రమే ప్రచారం చేస్తూ బిహార్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ సమర్థ నాయకత్వంలో ఎన్డీఏ కూటమితో విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శీలమంతుల రవీంద్రచారి, నగరపు రమేష్, నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, గంగిశెట్టి రాజ్‌కుమార్, సూర్యదేవర విశ్వనాథ్, గాదం కుమార, రవిరెడ్డి, రాయంచు నాగరాజు, హేమాద్రి, పాపిరెడ్డి, కట్టన్న, రెడ్డి శ్రీనివాస్, గంగుల రాజ్‌కుమార్, కాసర్ల సురేష్, ప్రేమ్ సింగ్, ఎల్కతుర్తి శ్రీహరి, రతన్, రాజన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కాటారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించడంపై బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫిలిమ్ సెన్సార్ బోర్డు సభ్యుడు, బీజేపీ నేత



ములుగులో విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

దుర్గం తిరుపతి మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా సాగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్, జిల్లా, మండల నేతలు భాస్కర్‌రెడ్డి, శ్రీశైలం, సదానందం, శేఖర్, సునీల్, రమేష్, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

- రేగొండ(ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించడంపై మండల బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, నాయకులు లింగారెడ్డి, పెండ్యాల రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంఘాలపై ఆరోపణలు సరికాదు

తాడ్వాయి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాలపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదని ఆదివాసీ సంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ దబ్బకట్ల సుమన్ శుక్రవారం తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారలమ్మల దేవస్థానం ప్రపంచ ప్రఖ్యాతి పొందేలా, వందల సంవత్సరాలు నిలిచేలా అభివృద్ధి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తు న్న బీఆర్ఎస్ నాయకులు ఆదివాసీ సంఘాలపై తప్పుడు ప్రచారాలుచేయడం మానుకోవాలని హెచ్చరించారు. పార్టీలు ఏవైనా ఆదివాసీల అభివృద్ధికి తోడ్పడితేనే స్వాగతిస్తామని పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మల దేవస్థానం అభివృద్ధిని రాజకీయం చేస్తే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. పూజారులు, ఆదివాసీ సంఘాల నిర్ణయం మేరకు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని గుర్తుంచుకొని మాట్లాడాలన్నారు. ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముద్దబోయిన రవి, కోర్నిబెల్లి గణేష్, పాయం కోటేశ్వరరావు, చేల శామంతకమణి, మల్కం రాధిక, కొప్పుల జగన్నాథరావు, పూర్ణ పాల్గొన్నారు.